జీవిత చరిత్ర

# యోబు

**(గత సంచిక తరువాయి) - 3**

యోబు దేవునిపట్ల ఎంతో భక్తిశ్రద్ధలు కలిగినవాడు. ఎంతటి భక్తి శ్రద్ధలు కలిగినవాడంటే దేవుడైన యెహోవాకు కూడా అతనిపై పూర్తి నమ్మకం కుదిరింది. సాతానుతో యోబు విషయమై చాలా గట్టిగా నమ్మకంగా చెప్పాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ యోబు వల్ల దేవుడు సాతాను యెదుట తలదించు కోవలసిన పరిస్థితి రాదనే గట్టి నమ్మకంతోనే యోబుకున్నవన్నీ తీసివేయడానికి



సాతానుకు యెహోవ పర్మిషన్ ఇచ్చాడు. యోబు హృదయంలో యెహోవా దేవునికి తప్ప వేరొకరికి స్థానం లేనే లేదనే విషయం యెహోవా దేవునికి బాగా తెలుసు. అయినా గాని యోబు హృదయాన్ని పరిశీలిస్తే అది దేవునికి ఇష్టమైన లక్షణాలను పూర్తిగా కలిగిన హృదయం కాదని అర్థమవుతుంది. తన హృదయాన్ని గూర్చి యోబు చూచుకునే దృష్టి కోణం వేరు. కాని అదే హృదయాన్ని దేవుడు చూచే దృష్టి కోణం వేరు. తనగూర్చి తాను యోబు చాలా గొప్పగా ఆలోచించు కుంటున్నాడు. కాని తన హృదయం పట్ల దేవుని మూల్యాంకనం ఎలా వుందో యోబు గుర్తెరగ వలసి వుంది. తన హృదయాంతరాళంలో ఉండకూడని లక్షణాలు ఏమి వున్నాయో యోబు తెలుసుకోవలసి వుంది.

సాతాను హస్తం యోబుమీద పడకముందు యోబు తనను గూర్చి ఇలా అనుకునేవాడు.... (యోబు 29 అధ్యాయం)

దేవుడు తన్ను కాపాడుచుండిన దినములలో అయితే దేవుని దీపము నా తలకుపైగా ప్రకాశిస్తూ ఉండేది. దేవుని ప్రకాశం వలన నేను చీకట్లో సహితం తిరుగుతుండేవాడిని. నా పిల్లలు నా చుట్టూ ఉండేవారు. నేను వస్తే యౌవ్వనులు, ముసలివారు, అధికారులందరూ లేచి నిలుచుంటారు. ఎంతో గౌరవిస్తారు. నేను ఎంతోమందికి సహాయం చేసాను. నేను నీతిని అస్త్రముగా ధరించుకొన్నాను. కాబట్టే అది నన్ను ధరించింది. అస్సలు నా న్యాయమంటే తిరుగేలేదు. అదే నాకు వస్త్రము, పాగా. నేను నా స్వంత ఇంటిలోనే చనిపోతాను. హంసలాగా చాలా కాలం బ్రతుకుతాను. నా వేళ్ల చుట్టూ నీళ్ళు వ్యాపిస్తాయి. నాకు ఎప్పుడూ ఘనత కలుగును అని తన మనసులో తనకు తానే ఎంతగానో గర్వపడేవాడు. యోబు ఎంత మంచివాడైనాగాని అతని హృదయంలో గర్వ ముంది. ఆ విషయాన్ని అతను మొదట్లో గ్రహించ లేదు. నేను దేవునిపట్ల

భయభక్తులతో ఉన్నాను. దేవుడు నాకు తోడుగా ఉన్నాడు. నాకేంటి ? నాకు అంత వుంది, ఇంత వుంది, నేను అట్లా చేస్తాను ఇట్లా చేస్తాను, నేను పట్టిందే బంగారం, నేను అడిగితే దేవుడట్లానే ఇచ్చేస్తాడు, నేను ఏది అడిగితే అది దేవుడు ఇచ్చేస్తాడు. దేవుడికి నాకు అంత మంచి సంబంధ బాంధవ్యాలున్నాయి అన్న చందాన తన హృదయంలో గర్వం చోటు చేసుకుంది. స్వనీతి చోటుచేసు కుంది. అంతా 'నా', 'నన్ను', 'నాకు', 'నేను' అనే ఆత్మ స్తుతియే.

ఇక్కడ ముఖ్యమైన ఒక విషయం గ్రహించాలి. యోబు ఏయే విషయాల్లో తనకుతాను పొగడుకున్నాడో ఆ విషయాలన్నీ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకుండా ఉండకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మనం దేవునిపట్ల యోబులా భక్తిశ్రద్ధలతో ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ యోబులా దీనులను, తండ్రిలేని వారిని, సహాయం లేనివారిని విడిపించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ విధవరాండ్ర హృదయాన్ని సంతోషపెట్టాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ యోబులా నీతిని వస్త్రంగా ధరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ యోబులా న్యాయ ప్రవర్తన కలిగివుండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ దరిద్రులకు తండ్రిగా ఉండాలి. ఇలా యోబుకున్న మంచి లక్షణాలన్నీ మనమూ కలిగివుండాలి. కాని నేను గాక ఇవన్నీ చేస్తున్నాను. నాకు గాక ఇవన్నీ వున్నాయి అన్న గర్వం ఎప్పుడైతే మనలో వుందో ఇన్ని మంచి లక్షణాలను గురించి సంతోషిస్తున్న దేవుడు ఏదో ఒక పద్ధతిలో తనలో ఆయనకు నచ్చని ఆ గర్వంలాంటి లక్షణాన్ని తను తొలగిస్తాడు. ఆ ప్రక్రియలోనే మనపైకి శ్రమలను పంపడానికి సాతానుకు అనుమతి కూడా ఇవ్వవచ్చు. ఆ శ్రమలు మనమేదో తప్పు చేసామని, ఆ తప్పుకు ప్రతిగా దేవుడు మనకు ఇచ్చే శిక్షయే ఆ శ్రమలని భావించకూడదు. మనమెంతో నమ్మకంగా ఆయనకోసం జీవిస్తున్నాగాని మన హృదయాంతరాళంలో ఉండకూడని ఒక్క చిన్న అవాంఛనీయ లక్షణాన్ని మనం గుర్తెరిగి దాన్ని మన హృదయం నుంచి తొలగించుకొనేలా చేసుకోవడానికి దేవుడు అనుమతించే సరిదిద్దుడు చర్యలే ఆ శ్రమలు.

అందువలన దేవుడు మనకు కలుగజేసే శ్రమల వెనుక లేక దేవుని చిత్తంతో మనకు కలిగే శ్రమల వెనుక ఒక మహత్తరమైన దేవుని ఉద్దేశ్యము మనపట్ల ఉంటుందనే విషయం మనం తెలుసుకోవాలి. మనం దేవునిలో ఉంటే గనుక మన జీవితంలో ఎదురైన అతి చేదైన అనుభవాల వెనుక దేవుని యొక్క అత్యంత కృపగల ఉద్దేశాలుంటాయి. ఆ చేదైన అనుభవాలు ఎప్పుడూ మనము తట్టుకోలేనివిగా ఉండవు. మన శక్తికి మించినవిగా ఉండవు. యోబు తన జీవితంలో మనమెవ్వరమూ పొందనంత చేదైన అనుభవాలను పొందాడు. అయినాగాని అతడు దేవునిపట్ల విశ్వాసాన్ని కొంచెంకూడ సడలించలేదు. యోబు యొక్క శ్రమల ఫలితంగా అతని మిత్రులు, అతని భార్య, అతని

సన్నిహితులందరి తలంపులు వేరుగా ఉన్నాయి. కాని యోబు యొక్క తలంపులు వేరుగా ఉన్నాయి. యోబు 23 వ అధ్యాయంలో అతని శ్రమల గురించి అతని ప్రతిస్పందన మనకు చక్కగా కనబడుతుంది. యెహోవా దేవుని నేను కనుగొనలేకపోయాను. తూర్పు, పడమర, ఉత్తరం....ఇలా అన్నీ వెదికేసాడంట. కానీ ఆయనను కనుగొనలేకపోయాడట. కాని "నేను నడచు మార్గము ఆయనకు తెలియును" అంటున్నాడు. (యోబు 23:10) అంతేకాదు "ఆయన నన్ను శోధించిన తరువాత నేను సువర్ణమువలే కనబడుదును" అని ఆయనమీద విశ్వాసాన్ని ఏ మాత్రమూ కోల్పోకుండా చెబుతున్నాడు. సరికదా ఈ శోధనలన్నీ అయిపోయిన తరువాత నేను పుటము వేయడిన బంగారము మెరిసినట్లు మెరిసిపోతానంటున్నాడు. దేవునిపట్ల అంత విశ్వాసం. తనపట్ల అంత నమ్మకం. 66వ కీర్తనలో కీర్తన కారుడు వెండిని నిర్మలము చేయురీతిగా మమ్ము నిర్మలులము చేసివున్నావు అంటున్నాడు. కీర్తన 26:10.

ఒక ముఖ్యమైన విషయమేమంటే యోబుకు కష్టాలు మొదలవటానికి కొంచెం ముందు ఏమి జరిగిందో యోబుకు అసలు తెలియనే తెలియదు. దేవుడు ఆ విషయాన్ని యోబుకు మరుగుపరచాడు. యెహోవా దేవునికి, సాతానుకి మధ్య యోబును గూర్చి జరిగిన సంభాషణ విషయం గురించి యోబుకు ఏమీ తెలియదు. దేవుడు దానిని మనకు మాత్రమే తెలిసేలా చేసాడు. యోబు 1,2 అధ్యాయాలలో విషయాలు యోబుకు ముందే తెలిసుంటే యోబు యొక్క స్పందన ఎట్టి పరిస్థితుల్లోనూ వేరేగా ఉండేది. అతనికి ముందే తెలిసుంటే ఇంకా అక్కడ విశ్వాసానికి తావులేదు. కనీసం అంతా అయిపోయిన తరువాత కూడా ఈ విషయాలను దేవుడు యోబుకు తెలియనివ్వలేదు. దేవుని హస్తం క్రింద మనం శ్రమలను, బాధలను, కష్టాలను ఇష్టపూర్వకంగా సహిస్తే మనకు ఆశీర్వాదాలు కాచుకొని వుంటాయి. అందుకే పేతురు అంటాడు. "తన నిత్య మహిమకు క్రీస్తునందు మిమ్మును పిలిచిన సర్వ కృపానిధియగు దేవుడు కొంచెం కాలము మీరు శ్రమపడిన పిమ్మట తానే మిమ్మును పూర్ణులనుగా చేసి స్థిరపరచి బలపరచును. (1 పేతురు 5:10) అయితే ఈ కొంచెం కాలంలోనే మనం మన విశ్వాసాన్ని కోల్పోతామా ? లేక స్థిరులపై పుటము వేయబడినవారముగా, స్వచ్ఛమైన వారముగా ప్రకాశవంతమైన వారముగా బయటకు వస్తామా ? అనేది దేవునియందు మనకు గల విశ్వాసాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. అలాంటి విశ్వాసము లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ మనం దేవుని సంతోషపెట్ట లేము. దేవునికి ఇష్టులై ఉండలేము. (హెబ్రీ 11:6)

"నా కుమారుడా ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము. ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుగకుము. ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును". (హెబ్రీ 12:5-6) ఇక్కడ కుమారుడా అంటే అర్థము ఒక మగవారినే కాదు గాని అందరినీ అని అర్థము.

(తరువాయి సంచికలో)